సాక్షి ఒడిశా
ఆదివారం | 14 | జనవరి | 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.4,92,337
బంగారం	23 గ్రాముల 750 మిల్లీ గ్రాములు
వెండి	47 గ్రాముల 600 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ



ప్రాకార ప్రాజెక్టుకు అంకురార్పణ

శ్రీమందిరం ప్రాకార పథకం లోకార్పణ మహోత్సవానికి పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ శ్రీకారం చుట్టారు.

- IIలో



సందడే.. సందడి

పర్లాకిమిడి రైల్వేస్టేషన్ వద్దనున్న ఆర్ఎంసీ ప్రాంగణంలో నిర్వహించిన శనివారం వారాంతపు సంతలో సందడి వాతావరణం నెలకొంది.

- IIలో

న్యూస్‌రీల్

వైభవంగా తిరుప్పావై పూజలు



తిరుప్పావై సేవలో వేంకటేశ్వరుడు

పర్లాకిమిడి: స్థానిక కేవుటి వీధిలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా తిరుప్పావై పూజలు శనివారం వైభవంగా నిర్వహించారు. పులిహోర రాశులతో వేంకటేశ్వరుని తయారు చేయగా, స్వామివారికి తిరుప్పావై సేవలో మహిళలు పాటలు పాడారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఎ.రాజగోపాలచారి ఆధ్వర్యంలో పూజలు చేపట్టారు.

కళాశాలల నిర్వాహకులపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయగడ: స్థానిక బారిజోల సమీపంలోని జీఏసీఆర్ మైదానంలో ఇటీవల నిర్వహించిన నువా–ఓ ఫెస్ట్ కార్యక్రమంలో ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. దీంతో జిల్లా కాంగ్రెస్ నాయకులు ప్రమాదానికి గురైన విద్యార్థినులు చదువుతున్న కళాశాలల నిర్వాహకులు, ప్రిన్సిపాల్స్‌పై శనివారం సదరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల తల్లిదండ్రుల అనుమతి లేకుండా కళాశాలల నుంచి రాయగడలో జరిగిన కార్యక్రమానికి ఎలా పంపిస్తారని ప్రశ్నించారు. సదరు పోలీసుస్టేషన్ ఐఐసీ కమలా కాంత్ కుహరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

పక్షుల గణన పూర్తి



కొరాపుట్ అటవీ ప్రాంతంలో పక్షి

జయపురం: జయపురం అటవీ డివిజన్ పరిధిలోని 6 రేంజ్‌లలో పక్షుల గణన పూర్తయినట్లు ఏసీసీఎఫ్ సుభాష్ చంద్ర కుంటియ తెలియజేశారు. జయ పురం డీఎఫ్‌వో ప్రతాప్ కుమార్ బెహర ఆదేశాల మేరకు జయపురం అటవీ డివిజన్ పరిధి జయపురం, బొరిగుమ్మ, కోట్‌పాడ్, బొయిపరిగుడ, గుప్తేశ్వర్ కుంద్ర రేంజ్‌లలోని 29 జలాశయాల్లో పక్షులను లెక్కించినట్లు వెల్లడించారు. ఆయా అటవీ ప్రాంతాల్లో ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పక్షులను లెక్కించడం జరిగిందన్నారు. పక్షుల లెక్కింపులో రేంజర్లు, ఫారెస్టర్లు, అటవీ సిబ్బంది పాల్గొన్నట్లు వెల్లడించారు. పక్షుల లెక్కింపులో జయపురం అటవీ డివిజన్ పరిధిలో 36 జాతులకు చెందిన 7,873 అటవీ, జలాశయాల పక్షులు ఉన్నట్లు వెల్లడించారు. అత్యధికంగా గుప్తేశ్వర్ ప్రాంతంలో 9 జాతుల పక్షులు ఉన్నట్లు తెలిపారు. అలాగే కోట్‌పాడ్ రేంజ్‌లో 3 జాతులు, బొయిపరిగుడ రేంజ్‌లో 7 జాతులు, కుంద్రలో 4 జాతులు, జయపురంలో 5 జాతులు, బొరిగుమ్మలో కేవలం ఒక జాతికి చెందిన జలాశయ పక్షులు ఉన్నట్లు, అలాగే మురాణ జలాశయ ప్రాంతంలో 29 ప్రాంతాల్లో పక్షులు లెక్కించినట్లు వెల్లడించారు.

103 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి బస్తాలు

కొరాపుట్: జిల్లాలోని పోలీసులు 103 కిలోల గంజాయిని శనివారం స్వాధీనం చేసుకున్నట్లు మాచ్‌ఖండ్ పోలీసులు తెలియజేశారు. గంజాయి తరలిస్తున్నట్లు వచ్చిన ముందస్తు సమాచారం మేరకు ఆంధ్రా–ఒడిశా సరిహద్దులో కొరాపుట్ జిల్లా జోలాపుట్ సమీపంలోని సాగర్ రోడ్డు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానంతో ఒక బొలేరో వాహనాన్ని ఆపడానికి ప్రయత్నించగా, వాహనం ఆపకుండా వెళ్లింది. దీంతో పోలీసులు వెంబడించగా ఒక చెట్టుకుఢీకొంది. దీంతో బొలేరోను వదిలేసి అందులో ఉన్నవారు పరారయ్యారు. అనంతరం పోలీసులు వెళ్లి తనిఖీలు నిర్వహించగా 103 కేజీల గంజాయి బయటపడింది. వెంటనే సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

ఎండు చేపకు పన్నుపోటు

- 12 శాతం జీఎస్టీతో అయోమయం
- కొనుగోళ్లకు ఆసక్తి చూపని వ్యాపారులు
- తీరంలో పేరుకుపోతున్న నిల్వలు
- కుళ్లిపోతుండడంతో ఆందోళనలో మత్స్యకారులు




బరంపురం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వస్తు సేవల పన్ను (జీఎస్టీ) మత్స్యకారులను సంక్షోభంలోకి నెడుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా విధిస్తున్న 12 శాతం పన్ను ఎండు చేపల వ్యాపారంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫలితంగా అసలే అంతంతమాత్రంగా ఉన్నటువంటి మత్స్య పరిశ్రమ నష్టాల్లోకి వెళ్తోంది. దీంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముందుకు రాని వ్యాపారులు

రాష్ట్రంలో 484 కిలోమీటర్ల సముద్ర తీర ప్రాంతంలోని సుమారు 125 పైగా మత్స్యకార గ్రామాల్లో 35 వేల మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. వీరంతా సముద్రంలో వేటకి వెళ్లి జీవనం సాగిస్తున్నారు. అయితే మత్స్య సంపద రక్షణ కోసం ప్రతిఏటా ప్రభుత్వాలు ఏప్రిల్ 1వ తేదీ నుంచి మే చివరి వరకు నిషేధం విధిస్తున్నాయి. మరికొంత కాలం ప్రకృతి వైపరీత్యాలతో వేట బంద్ చేయాల్సిన పరిస్థితులు ఉంటాయి. అలాగే ఆలీవ్ రిడ్లే తాబేళ్ల సంరక్షణ కోసం నవంబర్ నుంచి ఏప్రిల్ వరకు ప్రభుత్వం సముద్రంలో చేపల వేట నిషేధిస్తోంది. దీంతో ఏడాదిలో కొద్దికాలం మాత్రమే చేపల వేట సాగిస్తూ ఆటుపోట్ల మధ్య అర్ధాకలి జీవితాలు సాగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఎండు చేపలపై 12 శాతం విధిస్తున్న పన్నుతో కొనుగోలుదారులు ముందుకు రావడం లేదు. దీంతో మత్స్యకారులు మరింత కష్టాల్లోకి కూరుకుపోతున్నారు.

గంజాం నుంచి అధిక శాతం

రాష్ట్రంలో 484 కిలోమీటర్ల తీరం ఉండగా గంజాం జిల్లాలో మత్స్య సంపదకి ప్రత్యేక డిమాండ్ ఉంది. రాష్ట్రంలో అత్యధిక శాతం చేపల ఎగుమతులు ఇక్కడి నుంచే జరుగుతాయి. ఆసియాలోనే అతి పెద్దదైన చిలికా సరస్సు, గోపాల్‌పూర్ పోర్టుతో పాటు మత్స్యకార గ్రామాలైన అర్జిపల్లి, పెద్ద అర్జిపల్లి, సూన్‌పూర్, రామయ్యపట్నం, కొత్తూరు, భక్షిపల్లి, గొళాబంద, కొత్త గొళాబంద, రామచంద్రపురం, బలరామ్‌పూర్, పట్టి సూన్‌పూర్, పోరంపేట, గారమ్మపేట, మార్కండి, నూవ నొలియాగాం, పుర్ణబలొంద ప్రాంతాల్లో సుమారు 2,000 పైగా బోట్లు చేపల వేట సాగిస్తాయి. ఈ బోట్లు వేటాడి తెచ్చే చేపల్లో కొన్నింటిని పచ్చివిగానే విక్రయించగా, మరి కొన్ని ఉప్పులో ఊరబెట్టి ఎండబెడతారు. చేపలు ఎండిన అనంతరం బస్తాల్లో నిల్వచేసి వ్యాపారులకు, ఎగుమతిదార్లకు విక్రయిస్తారు. ఇక్కడ నుంచి పక్క రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాలకు ఎక్కువగా ఎగుమతి అవుతాయి.



అర్జిపల్లిలో నిలిచిన బోట్లు



అర్జిపల్లిలో చేపలు విక్రయిస్తున్న దృశ్యం

రద్దు చేయకుంటే రోడ్డున పడతాం



ఎండు చేపలపై కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీ రద్దు చేయకపోతే రోడ్డున పడతాం. కొనుగోలుదారులు లేకపోవడంతో చేపలు ఎక్కువ రోజులు నిల్వ ఉండి పాడైపోతున్నాయి. దీంతో ఆర్థిక సంక్షభంలో చిక్కుకుంటున్నాము. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఎండు చేపలపై జీఎస్టీ రద్దు చేయాలి. లేదంటే త్వరలో కార్యాచరణ చేపట్టి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతాం.

– జి.ఎర్రయ్య, గంజాం జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు

టన్నుల కొద్ది నిల్వలు

అయితే జీఎస్టీ అమలు చేయకముందు ఎండు చేపల ఎగుమతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తలేదు. కానీ జీఎస్టీ వచ్చాక గత కొద్దికాలం నుంచి ఎండుచేపల కొనుగోళ్లకు ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో గోపాల్‌పూర్ హార్బర్, పలు జెట్టీల్లోని గోదాముల్లో టన్నుల కొద్దీ ఎండు చేపల నిల్వలు పేరుకుపోతున్నాయి. చేపలను కొనుగోలు చేసేందుకు ఎవరు వస్తారా అని మత్స్యకారులు ఎదురు చేస్తున్నారు.



గోపాల్‌పూర్ జెట్టీలో ఆరబెట్టిన చేపలు

జానపద కళాకారులకు శిక్షణ శిబిరం



మాట్లాడుతున్న బసంత కుమార్ ప్రధాన్



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ రైతా

రాయగడ: స్థానిక సాంస్కృతిక భవనంలో జిల్లా సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో జానపద కళాకారుల శిక్షణ శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రైతా మాట్లాడుతూ.. కళలకు పుట్టినిల్లుగా బాసిల్లుతున్న మన రాష్ట్రంలో కళాకారులు, కళలను పరిరక్షించేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో జానపద కళలు అంతరించిపోకుండా ఉండేందుకు, కళాకారులను ప్రోత్సహించేందుకు శిక్షణ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. జిల్లా సాంస్కృతిక విభాగం అధికారి బసంత కుమార్ ప్రధాన్ మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ ప్రాంతాలకు చెందిన జానపద కళాకారులను రప్పించి, వారికి ఒక్కరోజు శిక్షణ శిబిరాన్ని నిర్వహించామన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన కళాకారులు గ్రామాల్లో కళల గురించి విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉంటుందన్నారు. దీంతో కళారంగంపై ఆసక్తి గల వారికి కొంతవరకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మనోజ్ కుమార్ ప్రధాన్, క్రీడా శాఖ అధికారి షేక్ ఆలీ నూర్, జిల్లా పర్యాటక శాఖ అధికారి గుప్తేశ్వర్ ఖొర తదితరులు పాల్గొన్నారు.

సుందరంగా సూన్‌పూర్ తీరం

- మహేంద్ర గ్రూప్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు
- తీరాన్ని పరిశీలించిన అధికారులు



సూన్‌పూర్‌లో పర్యటిస్తున్న అధికారుల బృందం



సూన్‌పూర్ సముద్ర తీరం

బరంపురం: రాష్ట్రంలో బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పొందిన నీలాద్రీ, ముహన్, జహోనియా, హరిపూర్, సూన్‌పూర్ ఐదు సముద్ర తీరాలను అంతర్జాతీయ పర్యాటక తీరాలుగా ప్రభుత్వం అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు గంజాం జిల్లా కలెక్టర్ దివ్యజ్యోతి పరిడా, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కీర్తి హసన్‌లు జిల్లాలోని హరిపూర్, సూన్‌పూర్ తీరాలను శనివారం పరిశీలించారు. అధునిక ఎకో గార్డెన్, వాటర్ స్పోర్టింగ్, పర్యాటకులకు ఆహ్లాదకరంగా బోటింగ్ తదితర సౌకర్యాల కల్పనపై చర్చించారు. కాగా హరిపూర్ తీరంలో మత్స్యకారుల నుంచి వ్యతిరేకత రావడంతో సూన్‌పూర్ తీర ప్రాంతాన్ని మాత్రమే ఖరారు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ పర్యాటక స్థలంగా గుర్తింపు పొందేవిధంగా సూన్‌పూర్ తీరాన్ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. మొత్తం రూ.228 కోట్ల నిధులతో మహేంద్ర గ్రూప్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. సూన్‌పూర్ తీరానికి వెళ్లేందుకు 3 కిలోమీటర్ల రహదారి 16వ నంబర్ జాతీయ రహదారికి కలుపుతూ నిర్మిస్తున్నట్లు తెలియజేశారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే సూన్‌పూర్ తీరానికి పర్యాటకు తాకిడి మరింత పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



సూన్‌పూర్ ఉప్పునీటి సరస్సులో బోటింగ్ సదుపాయం



రహదారి నిర్మాణం చేపడుతున్న దృశ్యం

వసంతోత్సవాలకు సన్నాహాలు



వేదికపై బిజయ్ గొమాంగో, మమత గౌడో తదితరులు

రాయగడ: జిల్లాలోని గుణుపూర్‌లో ప్రతి ఏడాది అత్యంత ఘనంగా నిర్వహిస్తున్న వంశధార వసంతోత్సవాలను ఈసారి కూడా అదే తరహాలో నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈమేరకు గుణుపూర్‌లోని కన్యకా పరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గొమాంగో, మున్సిపల్ చైర్మన్ మమత గౌడో, వైస్ చైర్మన్ శివ గౌడో, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమాచరణ్ పట్నాయక్, మోటార్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఫణిభూషన్ పట్నాయక్ తదితరులు హాజరయ్యారు. ఈసారి జరగనున్న ఉత్సవాల్లో ఆదివాసీ మేళా, ఆదివాసీ సంస్కృతులు, కళలు ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించారు. అదేవిధంగా గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి నియమగిరి పర్వత ప్రాంతాల్లో నివసిస్తున్న డొంగిరియా తెగకు చెందిన ఆదివాసీలు రూపొందించే శాలువ, పుటాసింగ్ ప్రాంతంలో నివసించే లంజియా సవరల ఇడితాల్ చిత్రాలకు ఇటీవల భౌగోళిక గుర్తింపు లభించడంతో, ఈ ఉత్సవాల్లో వాటికి ప్రత్యేక స్థానాలను కల్పించడంతో పాటు వాటి ప్రచారాన్ని మరింతగా చేసేందుకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు చర్చించారు. ఇదిలాఉండగా వసంతోత్సవాల్లో భాగంగా జనవరి 28 నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు క్రీడోత్సవాలను, ఫిబ్రవరి 8 నుంచి 14 వరకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

కొత్త కమిటీ ఏర్పాటు

ఈసారి వంశధార వసంతోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. ఉత్సవ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా న్యాయవాది ఎ.బాబాప్రసాద్, కన్వీనర్‌గా బి.సతీష్ కుమార్, సహా కార్యదర్శులుగా లక్ష్మీ మహంకుడో, ఇంద్రాక్షి దాస్, ప్రదీప్ పాఢి, రమేష్ లిమ్మ, శివపాఢి, హండియా సాబొరా, మీనకేతన్ బాగ్, శక్తి దాస్, ప్రమోద్ దాస్‌లు వ్యవహరిస్తారని వీరితో పాటు పాత కార్యవర్గంలో ఉన్నవారు యధాతథంగా వ్యవహరిస్తారని ప్రకటించారు.



సమావేశంలో పాల్గొన్న పట్టణ ప్రముఖులు


విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బరంపురం: స్థానిక గిరిరోడ్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఉప జిల్లా పాలన యంత్రాంగం ఆధ్వర్యంలో చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు శనివారం నిర్వహించారు. పోటీల్లో నగరంలోని సుమారు 30 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. విజేతలకు జనవరి 26వ తేదీన జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు డీఆర్పీ రబీ కుమార్ బెహర తెలియజేశారు.

అక్రమ కలప మిల్లులపై దాడులు



మిల్లుపై దాడులు చేస్తున్న అటవీ అధికారులు

బరంపురం: గంజాం జిల్లాలో అటవీ మాఫియా విస్తరిస్తోంది. పచ్చని చెట్లను నరికి అటవీ సంపదను దోచుకుంటున్న కలప మాఫియా ఆగడాలకు అడ్డు లేకుండా పోతోంది. శనివారం జిల్లా అటవీ శాఖ ఆదేశాలతో కల్లికోట్ అటవీ రేంజ్ పరిధిలో బెల్లజరి అటవీ రహస్య ప్రాంతంలో గత కొద్దికాలంగా అక్రమంగా నడుస్తున్న కలప మిల్లుపై బరంపురం అటవీ అధికారుల దాడులు చేశారు. దీనిలో భాగంగా లక్షలు విలువ చేసిన కలప దుంగలు, కలప కోసే యంత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎఫ్‌వో అమ్లన్ నాయక్ తెలియజేశారు.



స్వాధీనం చేసుకున్న కలప దుంగలు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గోదాదేవి కల్యాణం



గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: నగరంలో కాశీనగర్‌లోని కోదండ రామాలయం ట్రస్టు ఆధ్వర్యంలో వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం గోదాదేవి కల్యాణం ప్రధాన అర్చకుడు మాడుగుల సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముత్తా శ్రీనివాసరావు, గౌరి దంపతులు, గాజుల శంకరావు, అన్నపూర్ణ దంపతులు గోదాదేవి కల్యాణం జరిపించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు ఈ-లెక్చర్ సదుపాయం

భువనేశ్వర్: ఉన్నత విద్యాబోధనలో రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. అధునాతన డిజిటల్ ఫార్మాట్‌లో నాణ్యమైన విద్యా బోధనను అందుబాటులోకి తీసుకొచ్చింది. రాష్ట్రంలోని కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థుల అభ్యాస అనుభవాన్ని పెంపొందించే ప్రయత్నంలో ఈ-లెక్చర్ సౌకర్యం ప్రవేశపెట్టింది. తొలి దశలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ వరుసగా 4 సెమిస్టర్లలో 11 ప్రధాన సబ్జెక్టుల్లో ఈ-లెక్చర్ అందుబాటులోకి తెచ్చారు. వీటిలో ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, పొలిటికల్ సైన్స్, ఒడియా, హిస్టరీ, ఇంగ్లిష్, సైకాలజీ, కామర్స్, ఎకనామిక్స్ అందుబాటులో ఉన్నాయి. ఈ వీటిని నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) రూపొందించిన ప్రత్యేక వెబ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ-లెక్చర్లను http://vtputkal.odisha.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చు. ఈ మేరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్లు, ప్రభుత్వ, ఎయిడెడ్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఉన్నత విద్యాశాఖ లేఖ రాసింది. ఈ అధునాతన సౌకర్యం వినియోగించడంపై చొరవ కల్పించుకోవాలని లేఖలో కోరారు. సాధారణ తరగతి గదు ల బోధనతో అనుబంధ అధ్యయనం, అభ్యాసానికి సాంకేతిక పరిజ్ఞానం బలపరిచే దిశలో ఈ-లెక్చర్ దోహదపడుతుందన్నారు. ఉన్నత విద్యారంగంలో రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్ష్యా అభియాన్ (రుసా) కింద విద్యార్థులు, అధ్యాపకులకు అపారమైన సామర్థ్యం పెంపొందించే సంకల్పంతో ఈ వ్యవస్థ ప్రవేశపెట్టారు. స్థానిక ఉత్కళ విశ్వవిద్యాలయం మార్గదర్శక సంస్థగా వ్యవహరిస్తుంది. ఈ - లెక్చరు రూపకల్పన కోసం అత్యాధునిక వర్చువల్ ట్యుటోరియల్ స్టూడియో ద్వారా ఉపన్యాసాలు అనుసంధానపరిచారు.

ఈనెల 29న ఖర్గే పర్యటన

భువనేశ్వర్: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐ సీసీ) అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే రాష్ట్ర పర్యటనకు విచ్చేయనున్నారు. ఈనెల 29న ఆయన భువనేశ్వర్ రానున్నట్లు శనివారం రాష్ట్ర కాంగ్రెసు వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా కార్యకర్తల సదస్సులో ఆయన పాల్గొంటారు. సార్వత్రిక ఎన్నికలు- 2024లో రాష్ట్రంలో పార్టీ బలం పునరుద్ధరించుకోవాలని తహతహలాడుతోంది. ఈ నేపథ్యంలో జాతీయ అధ్యక్షుడు ఖర్గే తన పర్యటనలో రాష్ట్ర యూనిట్ సీనియర్ నాయకులతో పార్టీ వ్యూహంపై చర్చిస్తారు. రాహుల్ గాంధీ మయూర్‌భంజ్, కెంజొహర్, సుందర్‌గడ్, ఝర్సుగుడ జిల్లాల మీదుగా పర్యటన చేపట్టనున్న భారత్ జోడో న్యాయ యాత్రకు సంబంధించిన సన్నాహాలను సైతం సమీక్షిస్తారు. వచ్చే ఎన్నికల్లో అధికార బిజూ జనతాదళ్ (బీజేడీ)ని ఎదుర్కోవడానికి రాహుల్ పర్యటన పార్టీలో కొత్త ఉత్సాహాన్ని ప్రేరేపిస్తుందని రాష్ట్ర కార్యకర్తలు భావిస్తున్నారు. ఖర్గే ఇటీవల న్యూఢిల్లీలో రాష్ట్రంలోని 21 లోక్‌సభ నియోజకవర్గాల సమన్వయకర్తలతో సమావేశమయ్యారు. వారి ప్రాంతాల్లో అత్యధిక ఓటర్లను చేరుకుని అధికార పక్ష పాలన లోటుపాటులపై అవగాహన కల్పించాలని సూచించారు.

ఎన్నికల కమిటీ ఏర్పాటు

రాష్ట్రంలో త్వరలో జరగనున్న లోక్‌సభ, శాసన సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ రాష్ట్ర ఎన్నికల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో 18 మంది సభ్యుల ను నియమించారు. ఈ కమిటీకి ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఓపీసీసీ) అధ్యక్షుడు శరత్ పట్నాయక్ నేతృత్వం వహిస్తారు. కాంగ్రెస్ శాసన సభ నేత (ఎల్‌ఓపీ) నాయకుడు నరసింగ్ మిశ్రా, ఒడిశా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు నిరంజన్ పట్నాయక్, జయదేవ్ జెనా, ప్రసాద్ హరిచందన్, ప్రచార కమిటీ చైర్మన్ బిజయ్ పట్నాయక్, మాజీ కేంద్రమంత్రి భక్త చరణ్ దాస్, ఏఐసీసీ కార్యదర్శి శరత్ రౌత్, ఎంపీ సప్తగిరి ఉలకా, ఎమ్మెల్యే సంతోష్ సింగ్ సలూజా, అలాగే పలువురు ప్రముఖులను కమిటీలో ఎక్స్-అఫీషియో సభ్యులుగా పేర్కొన్నారు.

సారా ప్యాకెట్లు స్వాధీనం

కంచిలి: మండలంలోని నువాగడ పంచాయతీ కొలాపానీ గ్రామానికి చెందిన సవర మహాలక్ష్మీ నుంచి రెండు సిమెంటు కవర్లలో 250 ప్యాకెట్లు, సవర దుర్లభో నుంచి రెండు సిమెంటు కవర్లలో 300 ప్యాకెట్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎస్.బాలరాజు శనివారం తెలిపారు. వీరిద్దరిపై వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నిబంధనల మేరకే మద్యం విక్రయాలు

శ్రీకాకుళం క్రైమ్ : సంక్రాంతి సందర్భంగా మద్యం అమ్మకాలు నిబంధనల మేరకే జరగాలని జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ బి.సుబ్బారావు అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పని వేళలు సక్రమంగా పాటించాలని, బెల్టు షాపులకు మద్యం సరఫరా జరగకుండా చూడాలని, జనం రద్దీ ఉన్నచోట స్థానిక పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు.

● సందడే.. సందడి



నాటుకోళ్ల అమ్మకాలు



కూరగాయలు, కొత్త కుండల అమ్మకాలు



ధాన్యం బుట్టలు, చాటలు అమ్మకం



కత్తులు, పీటలు అమ్మకాలు జరుపుతున్న దృశ్యం

స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న ఆర్ఎంసీ ప్రాంగణంలో నిర్వహించిన శనివారం వారాంతపు సంతలో సందడి వాతావరణం నెలకొంది. పండగ ముందు రోజు సంత పడడంతో కోళ్లు, ఆవులు, మేకలు, ధాన్యం బుట్టలు, కత్తిపీటలు, కాయగూరల కొనుగోళ్లు అమాంతం పెరిగాయి. నాటుకోళ్లు, మేకలు విపరీతమైన ధరలు పలికినా కొనుగోలుదారులు వెనక్కి తగ్గలేదు. నాటుకోళ్ల పుంజులు జత రూ.1,200లు పలికాయి. మరోవైపు గైబ, నమ్మనగుడ నుంచి వచ్చిన ఏజెన్సీ ఆదివాసీలు సాంప్రదాయ డప్పు వాయిద్యాలతో కనువిందు చేశారు. ఆదివారం సైతం ఉప్పలాడలో పండగ సంత జరగనుంది.

– పర్లాకిమిడి

ప్రాకార ప్రాజెక్టుకు అంకురార్పణ



ప్రాకార కట్టడంతో కాంతులీనుతున్న పూరీ శ్రీమందిరం

- పూజలు నిర్వహించిన పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్

భువనేశ్వర్: శ్రీమందిరం ప్రాకార పథకం లోకార్పణ మహోత్సవానికి పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్ శ్రీకారం చుట్టారు. అంకురార్పణ పురస్కరించుకుని రాజ భవనంలో బ్రాహ్మణవరణ కార్యక్రమం నిర్వహించారు. మహా యజ్ఞానికి నిర్ధారించిన శ్రీమందిరం ఈశాన్య దిశలో అంకురార్పణ పూజ శుక్రవారం చేపట్టారు. తదుపరి పూజలు శనివారం ప్రారంభించారు. ఈ పవిత్రమైన, అద్భుత మహోత్సవాన్ని సమన్వయంతో విజయవంతం చేయాలని మహారాజా పిలుపునిచ్చారు.

సంధ్య వేళలో పూజలు

అంకురార్పణకు ఖరారు చేసిన శుభ ముహూర్తం ప్రకారం శుక్రవారం సంధ్య వేళలో రాజ భవనంలో పూజాదులు నిర్వహించారు. రాజ భవన్ సముదాయంలో పూజలందుకుంటున్న కనకదుర్గతో పాటు ఇతర దేవతలకు గజపతి మహారాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సింహాసనం అధిష్ఠించిన గజపతి మహారాజా ప్రత్యేక పూజాదులతో బ్రాహ్మణవరణలో భాగంగా శ్రీ మందిరం ప్రాకార పథకం లోకార్పణ మహోత్సవం యజ్ఞయాగాదుల నిర్వహణకు 6 మంది బ్రాహ్మణులకు అవసరమైన



బ్రాహ్మణవరణ కార్యక్రమంలో పూరీ గజపతి మహారాజా దివ్యసింగ్ దేవ్

పూజ పాత్రలు, ఇతరతేర పూజా సామగ్రి అందజేశారు. గజపతి రాజగురువు దేవీప్రసన్న రాజగురు, సుధాంషు రాజగురు తదితర ప్రముఖులు ఈ పూజా కార్యక్రమం పర్యవేక్షించారు. కాగా శ్రీమందిరం ప్రాకార పథకం లోకార్పణ మహోత్సవం సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని ప్రధాన పాలనాధికారి(సీఏఓ) రంజన్‌కుమార్‌దాస్ కోరారు. ఈ కార్యక్రమంలో 108 మంది బ్రాహ్మణులు పాల్గొంటారన్నారు. వీరిలో శ్రీ మందిరం 4 వైపుల ద్వారాల ఆవరణలో నిర్వహించే చతుర్వేద యజ్ఞంలో 60 మంది వేద పండితులు పాలు పంచుకుంటారు. 48 మంది పండితులు మహాయజ్ఞంలో పాల్గొంటారు. ఈ లెక్కన ప్రాకార లోకార్పణ మహోత్సవ యజ్ఞం నిర్వహణలో సమగ్రంగా 108 మంది బ్రాహ్మణులు పాల్గొంటారని వెల్లడించారు.

12 మంది ఓఏఎస్ అధికారుల బదిలీ

భువనేశ్వర్: రాష్ట్రంలో సీనియర్ ఓఏఎస్ అధికారులకు బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వుల ప్రకారం 12 మంది సీనియర్ ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ (ఓఏఎస్) అధికారులను రాష్ట్ర ప్రభుత్వం పునర్వ్యవస్థీకరణలో బదిలీ చేసింది. కళింగనగర్, జగత్‌సింగ్‌పూర్‌లకు కొత్త అదనపు జిల్లా మేజిస్ట్రేట్‌లు (ఏడీఎం) నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం సాధారణ పాలన విభాగం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సీనియర్ ఓఏఎస్ అధికారి ఝార్సుగుడ ఏడీఎం లంకేశ్వర్ ఆమత్‌ను బదిలీ చేసి కళింగనగర్ ఏడీఎంగా నియమించారు. కటక్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) సంయుక్త కమిషనర్ అనితా పాత్రో జగత్‌సింగ్‌పూర్ ఏడీఎంగా నియమితులయ్యారు. కెంజొహర్ డిప్యూటీ కలెక్టర్ రామచంద్ర కిస్కు కెంజొహర్ ప్రభుత్వ వైద్య బోధన ఆస్పత్రి పాలనాధికారిగా, బసంత్ కుమార్ సెఠి కెంజొహర్ మున్సిపాలిటీ కార్యనిర్వహణ అధికారి (ఈవో)గా బదిలీ అయ్యారు. త్రిలోచన్ మహంతి కెంజొహర్ డిప్యూటీ కలెక్టర్‌గా, ఈప్సితా ప్రియదర్శిని మిశ్రా కటక్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) సంయుక్త కమిషనర్‌గా, సుధాంసు కుమార్ భొయి గంజాం జిల్లా అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. పల్లవి నాయక్ రౌర్కెలా మున్సిపల్ కార్పొరేషన్ సంయుక్త కమిషనర్‌గా, సూరజ్ కుమార్ పట్నాయక్ సోన్‌పూర్ డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. గంజాం జిల్లా హింజిలికాటు మండలం అభివృద్ధి అధికారి (బీడీవో) సుబ్రత్‌కుమార్ జెనా బరంపురం జిల్లా ప్రధాన ఆస్పత్రి పాలనాధికారిగా (ఏవో) నియమితులయ్యారు. కొరాపుట్ ఏడీఎంగా అమిత్ సర్కార్ మరియు బరిపద మున్సిపాలిటీ కార్యనిర్వహణ అధికారి (ఈవో)గా మధుస్మిత సామంతరాయ్ నియమితులయ్యారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

రాయగడ: స్థానిక ప్రసాద్ టెక్నో స్కూల్ ప్రాంగణంలో ఘనంగా సంక్రాంతి సంబరాలు శనివారం నిర్వహించారు. హిందూ సంస్కృతి, సాంప్రదాయాలు భావితరాలకు తెలిసేలా వేడుకలు నిర్వహించినట్లు స్కూల్ డైరెక్టర్ జీవీ ప్రసాద్ తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య ముగ్గుల పోటీలను నిర్వహించారు. సంక్రాంతి పండగను ప్రతిబింబించే ముగ్గులు అందరినీ ఆకర్షించాయి.



భోగీ మంట వేస్తున్న దృశ్యం



ఆకట్టుకుంటున్న ముగ్గులు

వికసిత భారత్ యాత్ర సమావేశం



వికసిత భారత్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక జయనగర్ సమీపంలోని ఎమ్యూజ్‌మెంట్ పార్క్‌లో వికసిత భారత్ సంకల్ప యాత్ర సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ కార్యదర్శి ప్రేమ కుమార్ ఝా ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికసిత భారత్ సంకల్ప యాత్ర ప్రధాన లక్ష్యాలను వివరించారు. వీడియో ప్రదర్శన ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలు, సాంస్కృతిక కార్యక్రమాలను వివరించారు. అనంతరం 11 మంది నిరుపేద వితంతువులకు రూ.20 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జయపురం మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్దార్థ పట్నాయక్, చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ శాశ్వత సభ్యుడు గౌతమ సామంతరాయ్, బీజేపీ నేత హిమాంశు మహాపాత్రో, సీడీవో గౌరబ శివాజీ ఇసాల్‌వార్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జయపురం రథొపాడియ నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు.



వితంతువులకు చెక్కులు అందజేస్తున్న ప్రేమకుమార్ ఝా

వణికిస్తున్న చలిపులి

భువనేశ్వర్: రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో చలిగాలులు కొనసాగుతున్నాయి. 11 చోట్ల 12 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా రాత్రి పూట కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. గత 24 గంటల్లో రాష్ట్రంలోనే అత్యంత శీతల ప్రదేశంగా కిరేయి నిలిచింది. ఈ ప్రాంతంలో రాత్రిపూట కనిష్ట ఉష్ణోగ్రత 8.9 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు అయింది.

పొగమంచు తీవ్రత

కటక్, సోన్‌పూర్, ఫుల్బాణి ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంటోంది. అంగుల్, భవానీపట్న, కెంజొహర్, రౌర్కెలాలో తేలికపాటి నుంచి మోస్తరుగా పొగమంచు కురుస్తోంది. ఆదివారం ఉదయం 8.30 గంటల వరకు కంధమల్, కలహండి, కొరాపుట్, నయాగఢ్, సుందర్‌గడ్, కెంజొహర్, మయూర్‌భంజ్, అంగుల్, కటక్ జిల్లాల్లో ఒకటి లేదా రెండు చోట్ల దట్టమైన పొగమంచు కురుస్తోందని వాతావరణ సంస్థ ఎల్లో వార్నింగ్ జారీ చేసింది. తదుపరి 48 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా ఒకటి లేదా రెండు చోట్ల తేలికపాటిగా పొగమంచు కురుస్తుందని సమాచారం. అలాగే ఈనెల 17వ తేదీ నుంచి రాష్ట్రంలో కొన్నిచోట్ల తేలికపాటి వర్షాలు కురిసే సూచన వాతావరణ కేంద్రం జారీ చేసింది.

గత 24 గంటల్లో నమోదైన కనిష్ట ఉష్ణోగ్రతలు

ప్రాంతం	కనిష్ట ఉష్ణోగ్రత (డిగ్రీలు సెల్సియస్)
కిరేయి	8.9
కొరాపుట్	9.0
రాణితల్	9.3
కెంజొహర్	10.0
రౌర్కెలా	10.0
సిమిలిగుడ	10.2
ఝార్సుగుడ	10.4
బరిపద	10.6
జి.ఉదయగిరి	10.8
ఫుల్బాణి	11.5
అంగుల్	11.6
కటక్	14.0
భువనేశ్వర్	15.5

620 నివాసాలు.. 103 మంది పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : ట్రైనీ డీఎస్పీ, ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, నలుగురు ఎస్ఐలతో సహా 103 మంది పోలీసు సిబ్బందితో శ్రీకాకుళం జిల్లాకేంద్రంగా బలగ హడ్కో కాలనీలో 620 నివాస గృహాల్లో శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వేకువజాము నాలుగు గంటలకు 11 బృందాలుగా ఏర్పడి ఇంటింటా వివరాలు ఆరా తీసినట్లు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పప్పల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎవరైనా అనుమానితంగా తారసపడితే పోలీసులకు తప్పక సమాచారమందించాలని ప్రజలకు సూచించారు. పండక్కి ఊర్లే వారు ఎక్కువ రోజులు ఉంటే కచ్చితంగా పోలీసులకు తెలియజేయాలని, ఇంటి వద్ద పోలీసు నిఘా పెడతామన్నారు. అనంతరం 497 ద్విచక్రవాహనాలు, ఏడు కారులు, నాలుగు ఆటోల ధ్రువ పత్రాలు పరిశీలించి రికార్డులు లేని పది వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ చప్పిడి రాజా, శ్రీకాకుళం రూరల్ సీఐ లెంక సన్యాసినాయుడు, రెండో పట్టణ ఎస్ఐలు నాగిరెడ్డి లక్ష్మణరావు, కె.లక్ష్మి, ఒకటో పట్టణ ఎస్ఐ బలివాడ గణేష్, గార ఎస్ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.



హరిహర సుతనే..!

జిల్లా కేంద్రాన్ని ఆనుకుని బలగలో నిర్మించిన అయ్యప్పస్వామి ఆలయం నిత్యపూజలు, ఉత్సవాలతో భక్తులకు వైకుంఠధామంగా అలరారుతోంది. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఈ ఆలయంలో కేరళ రాష్ట్రం శబరిమలై తరహాలో సంప్రదాయబద్ధంగా ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ప్రధానంగా మకర సంక్రాంతి నాడు శబరిమలలో మకరజ్యోతి దర్శనం ప్రత్యేకం కాగా ఇక్కడ కర్పూర జ్యోతి దర్శనం అదే స్థాయిలో ప్రత్యేకంగా నిర్వహిస్తారు.



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

- 15న బలగ అయ్యప్ప ఆలయంలో కర్పూర జ్యోతి వేడుకలు
- స్వామికి ప్రత్యేక అలంకరణలు
- శరణుఘోషతో ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్:

1978లో శ్రీకాకుళం నుంచి ఉమాదీక్షిత్, ప్రేమిజీ ఆధ్వర్యంలో అయ్యప్ప వ్రతాలు, శబరిమల యాత్ర ప్రారంభమైంది. నాటినుంచి ప్రతి ఏడాది భక్తుల సంఖ్య రెట్టింపవుతోంది. భక్తుల సంఖ్య పెరుగుతుండడంతో ఆలయాన్ని నిర్మించారు. 26 ఏళ్లుగా అయ్యప్పస్వామి శబరిమలలో మకరజ్యోతి దర్శనం రోజున అంటే సంక్రాంతి పర్వదినాన ఇక్కడి ఆలయంలోనూ కర్పూర జ్యోతి దర్శనాలకు కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పట్టు వస్త్రాల సమర్పణ, మణిమయ మకుఠ ఆభరణ అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం ఉంటుంది. సాయంత్రం దివ్య మకర జ్యోతి దర్శన సమయంలో అయ్యప్పస్వామికి కర్పూర జ్యోతి దర్శనం ఉంటుంది.

పక్కాగా ఏర్పాట్లు..

ఉత్సవాల నేపథ్యంలో ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నారు. మంగళవాయిద్యాలు, బాణసంచా వినోదాలతో, ఏకాదశ ఛత్ర సేవతో అయ్యప్పస్వామిని ఊరేగించేలా ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు. భక్తులందరికీ ఉచితంగా కర్పూరం పంపిణీ చేస్తారు. భక్తులు కూడా తమకు ఇచ్చిన కర్పూరాన్ని కర్పూర జ్యోతి అందులో వేస్తారు. ఈ వేడుకలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.



కర్పూర జ్యోతి దర్శనం (ఫైల్)

ఏర్పాట్లు పూర్తి



సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని శబరిమలలో మకర జ్యోతి దర్శనం సమయంలో ఇక్కడికి వచ్చే భక్తుల కోసం దివ్యమైన కర్పూర జ్యోతి దర్శనం ఏర్పాటు చేశాం. ఇప్పటికి 26 ఏళ్లుగా ఉత్సవం నిర్వహిస్తున్నాం.

– దేవరకొండ శంకరనారాయణ, అర్చకులు

క్లుప్తంగా

2 లక్షల టన్నుల చెరకు క్రషింగ్ పూర్తి



క్రషింగ్‌కు చెరకును తరలిస్తున్న రైతులు

రేగిడి : మండలంలోని సంకిలి వద్ద ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారంలో ఇప్పటి వరకూ 2 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు క్రషింగ్ పూర్తయిందని అసోసియేటివ్ వైస్ ప్రెసిడెంట్ పట్టాభిరామిరెడ్డి విలేకరులకు శనివారం తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం జిల్లాల నుంచి చెరకును తెచ్చి క్రషింగ్ చేస్తున్నామని వివరించారు. ప్రతీ రోజు 3700 టన్నులు చెరకు క్రషింగ్ అవుతుందని చెప్పారు. గతేడాది అక్టోబర్ చివరి వారంలో క్రషింగ్ ప్రారంభించామని, ఈ ఏడాది ఏప్రిల్ వరకు క్రషింగ్ చేస్తామని వెల్లడించారు. 4.10 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు లక్ష్యంగా చేసుకున్నామని వివరించారు. రైతులకు సకాలంలో చెరకు బిల్లులు చెల్లిస్తున్నామని వెల్లడించారు. ఇదిలా ఉండగా మండలంలో పలు గ్రామాల్లో రైతులు చెరకు పంట కోత పనుల్లో బిజీగా ఉన్నారు. చెరకును నరికి ట్రాక్టర్ల ద్వారా కర్మాగారానికి తరలిస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం



పురుషోత్తంనాయుడు

బలిజిపేట: పెదపెంకి గ్రామానికి చెందిన 30సంవత్సరాల పి.పురుషోత్తంనాయుడు ఈ నెల 11వ తేదీ నుంచి కనిపించడం లేదని ఆయన తమ్ముడు రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ పాపారావు శనివారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పురుషోత్తంనాయుడు ఈ నెల 10వ తేదీ రాత్రి ఇంటివద్ద పడుకున్నాడు. మర్నాడు ఉదయం నుంచి కనిపించకపోవడంతో ఆందోళన చెందుతున్నామని రాంబాబు ఫిర్యాదులో పేర్కొన్నారు. దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన దుర్గాప్రసాద్

కొత్తవలస : మండలంలోని కొత్తవలస – పెందుర్తి రైల్వేలైన్‌లో మంగళపాలెం గ్రామ సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి విశాఖపట్నం జిల్లా తాటిచెట్లపాలెం సమీపం సంజీవయ్య కాలనీకి చెందిన పిట్టా దుర్గాప్రసాద్ (47) శనివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కొద్ది కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్టు తెలిసింది. కాగా మంగళపాలెం గ్రామంలో తెలిసిన వారి ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు స్థానికులు తెలిపారు. జీఆర్‌పీ ఎస్‌ఐ శ్రీనివాసరావు, ఆర్‌పీఎస్ ఎస్‌ఐ ఏడీరావు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడు వివరాలను సేకరించి మృతదేహాన్ని విశాఖపట్నం కేజీహెచ్‌కి తరలించారు.

పాముకాటుతో మహిళ మృతి

మెరకముడిదాం: మండలంలోని యాడిక గ్రామానికి చెందిన సావుబాలమ్మ (33) శుక్రవారం పాముకాటుకి గురై శనివారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల్లోకి వెళ్తే... బాలమ్మ శుక్రవారం సాయంత్రం తన పొలంలో మొక్కజొన్న పంటను చూసేందుకు వెళ్లింది. మొక్కజొన్న పంటను పరిశీలిస్తుండగా పాముకాటుకు గురైంది. వెంటనే ఆమె ఇంటికి వెళ్లి తన భర్త శ్రీనుకు విషయాన్ని తెలియజేసింది. దానికి స్పందించిన ఆమె భర్త శ్రీను బంధువులు సహాయంతో చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్సని అందించిన వైద్య సిబ్బంది మెరుగైన వైద్యాన్ని అందించేందుకు విజయనగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాల శనివారం సాయంత్రం మృతి చెందింది. బాల పాముకాటుకు గురై మృతి చెందిన విషయాన్ని ఆమె భర్త శ్రీను బుధరాయవలస పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బుధరాయవలస ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు కృష్ణారావు



విజయనగరం అర్బన్: భారత అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ మిరియాల కృష్ణారావు ఎంపికయ్యారు. హరియానా రాష్ట్రంలోని ఫరీదాబాద్‌లో ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు జరిగే భారత అంతర్జాతీయ ఫెస్టివల్‌లో పాల్గొననున్నారు. సైన్స్ రంగంలో చేసిన పరిశోధనలు, నైపుణ్యాభివృద్ధి వల్లే అవకాశం వచ్చినట్టు కృష్ణారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ, కేంద్ర అణుశక్తి శాఖ, కేంద్ర అణుశక్తి శాఖ అధ్వర్యంలో సైన్స్ ఫెస్టివల్ జరుగుతుందన్నారు.

భోగి పండగకు ఆ గ్రామాలు దూరం

సంక్రాంతి పండగ అనగానే తొలి రోజు భోగి పండగ జరుపుకోవడం తెలుగు లోగిళ్లలో సంప్రదాయం. కానీ పలు గ్రామాల్లో భోగి పండగను జరిపే అలవాటు లేదు. ఇది ఆయా గ్రామాల వారు తమ ఆచారంగా భావిస్తున్నారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని నేటి తరం వారు కూడా పాటిస్తున్నారు.



తెర్లాం: భోగి పండగను జరుపుకోని తమ్మయ్యవలస గ్రామం

- ఏళ్లుగా వస్తున్న ఆనవాయితీ

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల ప్రజలు భోగి పండగను దశాబ్దాలుగా జరుపుకోవడంలేదు. భోగి పండగ రోజున ఏదో అరిష్టం జరిగిందన్న నెపంతో కొన్ని గ్రామాల్లో భోగి పండగను జరుపుకోవడం మానేయగా, మరికొన్ని గ్రామాల్లో మాత్రం భోగి పండగ సందర్భంగా భోగి మంటను వేసే అలవాటు తమ పూర్వీకుల నుంచి అలవాటు లేదని నేటికి జరుపుకోరు. మండలంలోని తమ్మయ్యవలస, కుమ్మరిపేట, పాములవలస, ఎన్.బూర్జవలస, వి.చిన్నయ్యపేట, ఆమిటి సీతారాంపురం, గొలుగువలస గ్రామాల్లోని ప్రజలు భోగి పండగను జరుపుకోరు.

దశాబ్దాలుగా భోగికి దూరం

వంగర: సంక్రాంతి వేడుకల్లో భాగంగా పండగ ముందురోజు భోగిని సందడిగా జరుపుకోవలసిన రోజు ఇది. 86 ఏళ్ల క్రితం ఆ గ్రామాల్లో సంభవించిన ఓ అపశ్రుతి....ఫలితంగా ప్రజల్లో బలంగా నాటుకుపోయిన మూఢనమ్మకమే భోగి పండగకు దూరమయ్యేందుకు ప్రధాన కారణం. మండలంలోని కె.కొత్తవలస, ఎం.సీతారాంపురం గ్రామాల్లో భోగి వేడుకలు గత కొన్ని దశాబ్దాలుగా జరుపుకోవడం లేదు. సుమారు 86 ఏళ్ల క్రితం కె.కొత్తవలసలో భోగి పండగ రోజున మంటలు వేస్తుండగా పశువుల శాలలో ఉన్న రెండు ఎద్దులు భోగి మంటల్లో పడి మృతి చెందాయి. ఎం.సీతారాంపురం గ్రామంలో సరదాగా భోగి మంటలు వేస్తుండగా రెండు పిల్లులు మంటల్లో దూకి కాలి బూడిదయ్యాయి. దీంతో ఆ గ్రామాలకు దైవకంగా ఏదో కీడు జరగబోతుందేమోనని, గ్రామ ప్రజలకు ఏమైనా నష్టం కలుగుతుందేమోనని మూఢ విశ్వాసంతో అప్పటి నుంచి భోగి మంటలు వేయడం మానేశారు.

ఆ గ్రామాల్లో భోగి లేదు

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామంలో భోగి పండగ చేయరు. తమ తాతల కాలం నుంచి ఈ పండగను తమ గ్రామంలో జరుపుకోవడం లేదని, పక్క గ్రామాల్లో వేసే భోగి మంటలు వద్దకు గ్రామస్తులు వెళ్లి వచ్చేస్తుంటారని పంచాయతీ సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు తెలిపారు. గ్రామంలో భోగి పండగరోజు గ్రామానికి చెందిన వాకముల్ల కుటుంబీకుల ఇంటి పండగ చేసుకుంటారు.

ఆ గ్రామాలు భోగి మంటలకు దూరం

బాడంగి: మండలంలోని ముగడ, భీమవరం, పిన్నవలస, పింద్రంగివలస గ్రామాల ప్రజలు భోగి మంటలకు దూరంగా గడుపుతారు. ఇందుకు ఒక్కో కథనం ఆయా గ్రామాల్లో ఉంది. అలా ఉన్న గ్రామాల్లో భీమవరం, బాడంగి ఉన్నాయి.

సంతకవిటి మండలంలో..

సంతకవిటి: మండల పరిధిలోని శ్రీహరినాయుడుపేట, కొండగూడేం, కాకరాపల్లి, గొల్లవలస, వాసుదేవపట్నం, పోతులజగ్గపేట, రంగారాయపురం తదితర గ్రామాలు కొన్ని దశాబ్దాల నుంచి భోగి పండుగకు దూరంగా ఉంటున్నాయి. పిల్లి వంటి మూగజీవాలు భోగి మంటలో పడిపోయిన కారణంగా అపశకునంగా భావించి భోగి పండగను తమ గ్రామాలలో జరుపుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు.

భోగీకి దూరంగా 'అలుగోలు'

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు గ్రామం భోగి పండగకు దూరం. పూర్వ పెద్దలు నుంచి ఈ ఆచారం కొనసాగిస్తున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. సుమారు 55 ఏళ్ల కిందట భోగి పర్వదినం రోజున జరిగిన అపచారం నేపథ్యంలో అప్పటి నుంచి భోగి మంట వేయడం లేదని, వేస్తే అరిష్టం జరుగుతుందని పెద్దలు ఈ నిర్ణయం తీసుకున్నారని స్థానికులు చెబుతున్నారు.



అలుగోలు గ్రామం

అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు చీపురుపల్లి విద్యార్థులు



గైడ్ కృష్ణారావుతో అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు వెళ్లనున్న విద్యార్థులు

చీపురుపల్లి: కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మకమైన ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్(ఐఐఎస్ఎఫ్)కు చీపురుపల్లి విద్యార్థులు వెళ్లనున్నారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ, కేంద్ర అణు శక్తి, కేంద్ర అంతరిక్ష పరిశోధనా శాఖ నేతృత్వంలో జనవరి 17 నుంచి 20 వరకు హర్యానా రాష్ట్రంలోని ఫరీదాబాద్‌లో గల ట్రాన్స్‌లేషనల్ హెల్త్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇనిస్టిట్యూట్‌లో అంతర్జాతీయ స్థాయి సైన్స్ ఫెస్టివల్ జరగనుంది. ఈ సైన్స్ ఫెస్టివల్‌ను తిలకించి, సైన్స్‌పై అవగాహన పెంచుకునేందుకు ఆంధ్రప్రదేశ్ నుంచి 20 మంది విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. అందులో ఐదుగురు విద్యార్థులు చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉన్నారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న ఎంఆర్.గాయత్రిదేవి, జేఏఎస్.శ్రీవిద్య, ఎన్.సుప్రియ, డి.పార్థసారది, టివిఎం.సూరజ్‌లకు అవకాశం లభించింది. గైడ్‌గా అదే పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా పని చేస్తున్న మిరియాల కృష్ణారావును కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. అక్కడ జరగనున్న అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌లో 17 విభాగాలకు చెందిన ప్రదర్శనలు ఉంటాయని గైడ్ కృష్ణారావు తెలిపారు. అంతర్జాతీయ సైన్స్ ఫెస్టివల్‌కు వెళ్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులను డీఈఓ లింగేశ్వర రెడ్డి, డిప్యూటీ ఈఓ వాసుదేవరావు, పాఠశాల హెచ్ఎం చంద్రశేఖర్ అభినందించారు.

4వేల భోగిపిడకలతో దండ

బొబ్బిలి: మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు చుక్క శ్రీనివాసరావు తెలుగు సంప్రదాయాలను స్మరిస్తూ 4వేల భోగి పిడకలను తయారుచేశారు. గత కొన్ని రోజులుగా వీటిని తయారుచేసి చిన్నారులతో కలిసి దండగుచ్చారు. ఆవు పేడతో చేసిన భోగి పిడకలు కాల్చడం వల్ల కలిగే ప్రయోజనాలను చిన్నారులకు వివరించారు.



భోగి పిడకలు, చిన్నారులు, విద్యార్థులతో చుక్క శ్రీనివాసరావు

ఆకట్టుకున్న రంగోలి పోటీలు



ముగ్గును తిలకిస్తున్న సీరియల్ నటి పూజామూర్తి, వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు, తదితరులు

విజయనగరం టౌన్: సనాతన సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించే విధంగా రంగోలి పోటీలు నిర్వహించడం ఎంతో అభినందనీయమని గుండమ్మ కథ సీరియల్ నటి పూజామూర్తి అన్నారు. వాజీ చానల్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో నిర్వహించిన రంగవల్లుల పోటీలకు మహిళల నుంచి అనూహ్య స్పందన లభించింది.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పూజామూర్తి మాట్లాడుతూ.. రంగుల పోటీలు సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకలన్నారు. మగువల చేతుల్లోంచి అలవోకగా నేలపైకి జాలువారి, చూపరులను కట్టిపడేసే అద్భుతమైన ఒక నైపుణ్యం ముగ్గు అని తెలిపారు.

వాజీ చానల్ మేనేజింగ్ డైరెక్టర్ గణపతినీడి శ్రీనివాసరావు మాట్లాడుతూ, 28 ఏళ్లుగా భారతీయ సనాతన సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణలో భాగంగా మహిళలను ప్రోత్సహించేందుకు రంగోలి పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

జెడ్పీ సిబ్బందికి పదోన్నతి నియామక పత్రాలు అందజేత



ఉద్యోగికి పదోన్నతి నియామక పత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్:

జిల్లా పరిషత్ కార్యాలయంలో టైపిస్టులు, జూనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న ఏడుగురికి సీనియర్ సహాయకులుగా పదోన్నతి కల్పిస్తూ జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం నియమక పత్రాలు అందజేశారు. చైర్మన్ కార్యాలయంలో యూవీ సత్యనారాయణకు విజయనగరం పీఐయూలో, యంవి రమణకు పార్వతీపురం డ్వామా కార్యాలయంలో, జివిఎస్ఎస్.రవికుమార్‌కు గజపతినగరం పీఆర్‌ఐలో , ఎం.ఇందిరాకు పాచిపెంట మండల పరిషత్ కార్యాలయంలో, ఎల్.పైడిరాజు, కె.దశరథరామ్, జి శ్రీనివాసరావుకు పార్వతీపురం ఐటీడీఏలో సీనియర్ సహాయకులుగా నియమిస్తూ జడ్పీ చైర్మన్ తన కార్యాలయంలో నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ కె.రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందాల రాయుళ్ల అరెస్టు

భోగాపురం: మండలంలోని లింగాలవలస గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై పోలీసులు దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు సీఐ బీవీ వెంటేశ్వరరావు తెలిపారు. ఈ దాడిలో అరెస్టు చేసిన వారి నుంచి మూడు కోడి పుంజులు, రూ.1600 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్టు చెప్పారు. జిల్లా ఎస్పీ దీపిక ఆదేశాల మేరకు సంక్రాంతి పండగ సందర్భంగా మండలం వ్యాప్తంగా కోడి పందాలు నిర్వహించే వ్యక్తులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని సీఐ తెలిపారు.

ఫైర్ ఇంజిన్ డ్రైవర్ ఆత్మహత్యా యత్నం

రాజాం సిటీ: స్థానిక ఫైర్ స్టేషన్‌లో ఫైర్ ఇంజిన్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న హోంగార్డు కేశవరావు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎప్పటిలాగే శుక్రవారం విధులకు హాజరైన ఆయన ఒక్కసారిగా కత్తితో గొంతు కోసుకున్నాడు. అందరూ ఉంటుండగానే ఈ ఘటన జరగడంతో అప్రమత్తమైన తోటి సిబ్బంది వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయంపై ఫైర్ ఎస్‌ఐ జనార్దనరావు వద్ద ప్రస్తావించగా ఎటువంటి సమస్యలు లేవని, ఎందుకిలా చేశాడో తెలియదని పేర్కొన్నారు.

సీతంను సందర్శించిన ఏప్ సొల్యూట్ వ్యవస్థాపకులు



ఏప్ సొల్యూషన్ సంస్థ ప్రతినిధులను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, తదితరులు

విజయనగరం టౌన్: ఏప్ సొల్యూట్ సంస్థ వ్యవస్థాపకులైన మడస పాపారావు, కల్పలత సీతం ఇంజినీరింగ్ కళాశాలను శనివారం సందర్శించారు. గతంలో ఏర్పరచుకున్న ఒప్పందం మేరకు సీతంను సందర్శించామన్నారు. ఏప్ సొల్యూట్ ఎస్ఏపీకు సంబంధించిన విస్తృత సేవలందిస్తున్న బహుళ జాతీయ సంస్థ ఏప్ సొల్యూట్‌కు జర్మనీ, యూకే, ఫ్రాన్స్, స్పెయిన్, ఆస్ట్రియా, స్విట్జర్లాండ్, చైనా, దుబాయ్ దేశాల్లో వాణిజ్య సంస్థలున్నాయన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనా సరళిలో నిర్దిష్టమైన మార్పు రావాలని, క్రమశిక్షణతో పాటూ నిబద్ధత ఉండాలన్నారు. ఐటీ రంగంలో ప్రస్తుతం కనబడుతున్న నిరుద్యోగ సమస్య నిజంగా చూస్తే కంపెనీలు ఆశించే పనితనానికి విద్యార్థుల సామర్థ్యానికి మధ్య పొంతన లేకపోవడమేనని పేర్కొన్నారు. భారతదేశంలో ఐటీ రంగంలో తరగని ఉద్యోగ అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్ డీవీ.రామమూర్తి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డి.అవినాష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుపై క్రిమినల్ కేసు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం టౌన్: రైతుల నుంచి అదనంగా ధాన్యం తీసుకుంటే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ గతంలో హెచ్చరించినప్పటికీ అందుకు పాల్పడిన పాలకొండకు చెందిన సత్యనారాయణ మోడ్రన్ రైస్ మిల్లుపై క్రిమినల్ కేసు శనివారం నమోదు చేశారు. వివరాలు పరిశీలిస్తే జియ్యమ్మవలస మండలం అలమండ గ్రామానికి చెందిన డొల్లు సతీష్ తన ధాన్యాన్ని విక్రయించేందుకు పాలకొండకు చెందిన సత్యనారాయణ మోడ్రన్ రైస్‌మిల్లుకు తరలించారు. అయితే 62 కిలోల ధాన్యం అదనంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అందుకు సంబంధించిన మొత్తాన్ని మోడ్రన్ రైస్ మిల్లు యాజమాన్యం ఫోన్ పే ద్వారా చెల్లించాలని డిమాండ్ చేయడంతో సతీష్ తప్పనిసరి పరిస్థితిలో చెల్లించారు. తన వద్ద ధాన్యం డిమాండ్ చేయడం, ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లింపుపై నేరుగా కలెక్టర్ నిషాంత్‌కుమార్‌కు సతీష్ శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ తక్షణమే స్పందించి క్రిమినల్ కేసు పెట్టాలని పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎండీ నాయక్‌ను ఆదేశించగా పాలకొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు. సతీష్‌కు ముందుగా అతను చెల్లించిన నగదును వెంటనే ఇప్పించారు. ఈ మేరకు కలెక్టర్ స్పందిస్తూ ఒక్క గింజ ధాన్యం అదనంగా తీసుకున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. హెచ్చరించిన తరువాత కూడా ప్రవర్తన మార్చుకోకపోతే చట్టరీత్యా చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. రైతులు ఒక్క గింజ ధాన్యం కూడా అదనంగా మిల్లర్లకు ఇవ్వరాదని ఆయన కోరారు. ధాన్యం కొనుగోలులో అవకతవకలపై 08963 29037, 77020 03582, 83338 13243 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన బాలిక



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: సంక్రాంతి పండగ పురస్కరించుకుని గంటస్తంభం, మార్కెట్ పరిసర ప్రాంతాలు ప్రజలతో కిటకిటలాడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆరేళ్ల తమటాపు దీక్షిత అనే బాలిక తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి, ఏడుస్తూ ట్రాఫిక్ పోలీసులకు కనిపించింది. వెంటనే అక్కడ నుంచి వన్‌టౌన్ హెచ్‌సీ ఆవు వెంకటరమణకు సమాచారమందించారు. పోలీసులు పాప వద్ద నుంచి సమాచారం సేకరించారు. గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన తమటాపు పైడినాయుడు కుటుంబ సభ్యులతో కలిసి పట్టణానికి వచ్చారు. షాపింగ్ చేసుకునే క్రమంలో వారి కుమార్తె దీక్షిత వారి నుంచి వేరై , తప్పిపోయినట్టు గుర్తించారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు కుటుంబ సభ్యులను మైక్ ద్వారా అనౌన్స్ చేయించి, వారిని స్టేషన్‌కు పిలిపించి విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు సమక్షంలో దీక్షితను తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో పోలీసులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సంధ్యారాణి వర్గీయుడుపై భంజ్‌దేవ్ కేసు

సాలూరు: తెలుగుదేశం పార్టీలో ఉన్న గ్రూపుల కొట్లాట ఇప్పుడు కేసుల వరకు వెళ్లింది. వివరాల్లోకి వెళ్తే.. గుమ్మడి సంధ్యారాణి, గొర్లె తిరుపతినాయుడు మద్దతుదారుడైన త్రిపురనేని విజయచౌదరిపై మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి పట్టణ సీఐ జీడీ బాబు తెలిపిన వివరాలు.. భంజ్‌దేవ్ వద్దకు ఈ నెల 1న నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు టీడీపీ సాలూరు టిక్కెట్ ఆశిస్తున్న తేజోవతి వచ్చారు. దీంతో తేజోవతికి తాను మద్దతు ఇస్తున్నానని అపోహ పడిన సంధ్యారాణి, జి.తిరుపతిరావుల మద్దతుదారుడైన త్రిపురనేని విజయచౌదరి తనను దుర్భాషలాడుతూ, బెదిరిస్తూ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో విడుదల చేశాడని భంజ్‌దేవ్ ఫిర్యాదు చేశారు. ఇది నా పరువుకు భంగం కలిగేలా ఉందని, ప్రాణహాని కలిగించే విధంగా ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. విజయచౌదరిపై తగు చర్యలు తీసుకోవాలని, తనకు న్యాయం చేయాలని భంజ్‌దేవ్ కోరారు.

భావితరాలకు సంస్కృతీ, సంప్రదాయాలు

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్



మాట్లాడుతున్న జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్

విజయనగరం: మన సంస్కృతీ, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్ కౌశిక్ అన్నారు. శనివారం స్థానిక రాజీవ్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్సాహవంతులైన బాలలు, యువజనులకు పతంగుల పోటీ (గాలిపటాల పోటీలను) నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి స్థానిక రాజీవ్ స్టేడియంలో నిర్వహించనున్న గాలిపటాల పోటీలలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు. ముందుగా పేర్లను రాజీవ్ స్టేడియంలో నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. సమావేశంలో సూరిబాబు, పిలక శ్రీను, కనకల గిరి, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- సీతం విద్యాసంస్థల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు



పల్లవిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, తదితరులు

విజయనగరం టౌన్: వెయిట్ లిఫ్టింగ్‌లో కళాశాల విద్యార్థిని పల్లవి అద్భుతమైన ప్రతిభ కనబరచడం ఎంతో ఆనందంగా ఉందని, రానున్న రోజుల్లో ఆమె ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సీతం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ఆకాంక్షించారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జాతీయ సీనియర్, జూనియర్ విభాగాల్లో పల్లవి పాల్గొని 64 కిలోల విభాగంలో రజతం, కాంస్య పతకాలు సాధించిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారిణి కెప్టెన్ ఎం.సత్యవేణి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చల్లా రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని అభినందనలు తెలిపారు.

తెలగ కులస్తులు రాణించాలి

- తెలగా కులస్తుల సంఘ జిల్లా అధ్యక్షుడు పల్లంట్ల వెంకట రామారావు



చిక్కాల దంపతులను సత్కరిస్తున్న తెలగా సంఘ ప్రతినిధులు

నెల్లిమర్ల: జిల్లాలో అధిక శాతమున్న తెలగా కులస్తులు అన్నిరంగాల్లో రాణించాలని తెలగా కులస్తుల సంఘ జిల్లా అధ్యక్షుడు పల్లంట్ల వెంకట రామారావు ఆకాంక్షించారు. పూసపాటిరేగ ఏఎంసీ చైర్‌పర్సన్‌గా నియమితులైన చిక్కాల అరుణకుమారిని జిల్లా తెలగా సంక్షేమ సంఘం శనివారం ఘనంగా సన్మానించింది. నెల్లిమర్ల పట్టణంలోని చిక్కాల స్వగృహం వద్ద జరిగిన సత్కార కార్యక్రమంలో వెంకట రామారావు మాట్లాడుతూ, తమ కులానికి చెందిన మహిళ ఏఎంసీ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, 5, 11 వార్డుల కౌన్సిలర్లు చిక్కాల సుమతి, చిక్కాల సంతోష్‌కుమార్‌లను సంఘం తరపున సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు గంటా అప్పలరాజు, గంటా సతీష్, పి.లక్ష్మణరావు, ఎం. శ్రీనివాసరావు, యాలాల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.